సాక్షి తిరుపతి
ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఏసీబీ వలలో అవినీతి తిమింగళం

అక్రమాస్తుల కేసులో మదనపల్లె రిటైర్డ్ ఆర్డీఓ ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏక కాలంలో దాడులు నిర్వహించారు. - 8లో



క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సూచించారు. - 8లో



మద్యం షాపు తొలగించండి

రేణిగుంట మండలం, రాజీవ్‌గాంధీ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎత్తివేయాలని మహిళలు డిమాండ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం ఎంపిక జాబితా విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం చిత్తూరు జిల్లాలోని గంగవరం మండలం జెడ్పీ హైస్కూల్ మేలుమాయి గ్రేడ్ హెచ్‌ఎం శ్రీధర్ బాబు, ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో బయాలజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ సురేంద్రబాబు ఎంపికయ్యారు. అలాగే తిరుపతి జిల్లాలోని తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఎంపీపీఎస్ ఎస్జీటీ బాలసుబ్రహ్మణ్యం, ఏర్పేడు మండలం బండారుపల్లె జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం రాజనగరం జెడ్పీ హైస్కూల్ బయాలజికల్ స్కూల్ అసిస్టెంట్ కామాక్షయ్య, ఏర్పేడు మండలం పల్లం జెడ్పీ హైస్కూల్ గ్రేడ్ 2 హెచ్‌ఎం ఆనంద్, ఏ.రంగంపేట జెడ్పీ హైస్కూల్ ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రభాకర్ రావును రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. రెండు జిల్లాల్లో ఎంపికైన టీచర్లు ఈ నెల 11వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని లబ్బిపేట ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ఎంపికైన టీచర్లు రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా అవార్డులను స్వీకరించనున్నారు.

ఆలయంలోకి ఫోన్లు తేవొద్దు!



సమీక్షిస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: భక్తులతో పాటు అధికారులు, సిబ్బంది సైతం ఫోన్లను ఆలయంలోకి తీసుకురాకూడదని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బాపిరెడ్డి స్పష్టం చేశారు. శీఘ్రదర్శనం కావాలంటే రూ.200 టిక్కెట్టు తీసుకోవాలన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో శనివారం ఆయన ఆలయ అధికారులతో సమీక్షించారు. ఈఓ మాట్లాడుతూ ఆలయంలో అందరూ సమానమన్నారు. భక్తులతో పాటు సిబ్బంది కూడా ఫోన్లను ఎత్తుకుపోవడం మానేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ వాకీటాకీ ఉండడం వల్ల దాంతో కమ్యూనికేషన్‌కు సరిపోతుందన్నారు. వీఐపీలకు సైతం పీఆర్వో కార్యాలయంలోనే టిక్కెట్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. దళారీల నిర్మూలనకు ఫేస్ రిగ్నైజేషన్ కెమెరాలు ఏర్పాటు చేసి ఎక్కువసార్లు గుడిలో తిరుగుతున్నవారిని పోలీసులకు అప్పగిస్తామన్నారు. సెక్యూరిటీ వ్యవస్థను, అన్నదానంలోని భోజనాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కైలాసగిరి పర్వతాల్లో డ్రోన్లతో సీడ్‌బాల్స్ వేసి పచ్చని చెట్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

రేపు జాబ్ మేళా

తిరుపతి అర్బన్: తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని అడ్మిట్ కార్డు తీసుకురావాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వాలని, ఇతర వివరాలకు 8555972657లో సంప్రదించాలని కోరారు.

మిత్ర ద్రోహం!

నామినేటెడ్ పోస్టుల భర్తీలో తెలుగు దేశం పార్టీ మిత్ర ధర్మాన్ని విస్మరించింది. మొదటి జాబితాలో మొండిచేయి చూపిన ఆ పార్టీ రెండో జాబితాలోనూ జనసేన, బీజేపీ నేతలకు చెక్ పెడుతూ మిత్ర ద్రోహానికి తెరలేపింది. పదవులు వస్తాయన్న ఆశతో ఎదురు చూసిన సొంత పార్టీ నేతలకు సైతం నిరాశే మిగిలింది. తమ పార్టీలో ఉన్నవాళ్లే వెన్నుపోటు పొడిచి.. కానివారిని అందలం ఎక్కించారని పలువురు విమర్శిస్తున్నారు.



- నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేన, బీజేపీకి మొండిచేయి
- రెండో విడతలోనూ తమ్ముళ్లకే అగ్ర తాంబూలం
- అందులోనూ జెండా మోసిన వారికి పంగనామాలు
- పోస్టుల భర్తీపై అంతర్మథనంలో టీడీపీ నేతలు
- సముచిత స్థానం ఇవ్వలేదని మిత్రపక్షాల ఆవేదన
- తుడా చైర్మన్ గిరిపై వీడని ఉత్కంఠ.. ఎవరికి వారు లాబీయింగ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి/చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పలు నామినేటెడ్ పోస్టులను కూటమి ప్రభుత్వం శనివారం భర్తీ చేస్తూ జాబితా విడుదల చేసింది. ఇందులో తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ఐదుగురికి చోటు దక్కింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్‌పర్సన్‌గా చిత్తూరుకు చెందిన మాజీ మేయర్ కటారి హేమలత, ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన నరసింహయాదవ్, ఏపీ వన్నియకుల క్షత్రియ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న సీఆర్.రాజన్‌ను, ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా తిరుపతికి చెందిన ఆర్.సదాశివ, ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా నీలాయపాళెం విజయకుమార్‌ను నియమించారు. ఈ ప్రకటన అటు మిత్రపక్షాల్లో, ఇటు సొంత పార్టీలో అగ్గి రాజేసిందనే చెప్పాలి.



సంబరాలు చేసుకుంటున్న కటారి హేమలత

మిత్రపక్షాలకు చోటేదీ?

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అనేక మంది నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. రెండు నెలల క్రితం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బీజేపీ, జనసేన పార్టీ నాయకుల్లో ఏ ఒక్కరికీ చోటు లభించలేదు. తాజాగా విడుదల చేసిన జాబితాలోనూ రెండు జిల్లాలకు చెందిన బీజేపీ, జనసేన నేతలకు ఒక్కటంటే ఒక్క పదవి కూడా దక్కలేదు. ఇది చంద్రబాబు నాయుడు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారా? లేదా? జిల్లాలో కీలకంగా ఉన్న జనసేన, బీజేపీ నాయకులు అడ్డుపడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదవులు పొందిన ఒకరిద్దరిపైనే ఆ పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండో జాబితాలో చోటు దక్కని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ, కిరణ్‌రాయల్, కోలా ఆనంద్, డాక్టర్ హరిప్రసాద్, దివాకర్‌రెడ్డి పలువురు మూడో జాబితాపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. అందులో ముఖ్యంగా తిరుపతి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (తుడా) చైర్మన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. తుడా చైర్మన్ గిరి కోసం ఎవరికి వారు అమరావతిలో లాబీయింగ్ నెరుపుతున్నారు.

యాదవ్‌ని కులానికే పరిమితం చేసిన బాబు

తిరుపతి జిల్లాలో టీడీపీ అంటే నరసింహయాదవ్ పేరు గుర్తొస్తుంది. ఎన్టీఆర్ హయాం నుంచి ఆయన టీడీపీని అంటిపెట్టుకుని ఉన్నారు. పసుపు చొక్కానే ధరించి 24 గంటలు పార్టీ కోసమే పనిచేసే వ్యక్తి ఆయన. ఇతనికి కీలక పదవి దక్కుతుందని అంతా ఆశించారు. చివరకు నరసింహయాదవ్‌కి ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి కేవలం కులానికే పరిమితం చేయడంపై ఆ సామాజికవర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతను టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో ఆమె కినుక వహించారు. దీంతో తాజాగా ఆమెను చుడా చైర్మన్‌గా నియమించారు. ఇప్పటి వరకు ప్రకటించిన రెండు జాబితాల్లో శాప్ చైర్మన్, ఆర్టీసీ చైర్మన్ పదవులు చెప్పుకోదగ్గవి. ఇందులో శాప్‌చైర్మన్ పదవిని రవినాయుడికి కట్టబెట్టడంపై తిరుపతి జిల్లా టీడీపీ శ్రేణులు లోలోన రగిలిపోతున్నారు. జిల్లాలో కీలకంగా వ్యవహరించే వారు, ఓటు బ్యాంక్ ఉన్న వారికి ఇవ్వకుండా.. చంద్రబాబు సొంత నియోజక వర్గానికి చెందిన రవినాయుడికి ఇవ్వడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే టీడీపీలో కీలకంగా వ్యవహరించే వారిని కాకుండా పైరవీలు చేసే వారికి పదవులు కట్టబెట్టడంపై ఆ పార్టీ నేతలు భగ్గుమంటున్నారు.

గ్రూపులు తప్పవా?

రెండో జాబితాలో కటారి హేమలతకు చుడా చైర్‌పర్సన్ పదవి దక్కింది. చుడా కుర్చీ కోసం చిత్తూరుకు చెందిన చెరుకూరి వసంతకుమార్ నాయుడు చేసిన తీవ్ర ప్రయత్నాలు బెడిసి కొట్టాయనే చెప్పాలి. ఇతనికి చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడుతో పాటు రెండు జిల్లాల నుంచి ఏడుగురు అధికారపార్టీ ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. అయితే ఇదే సామాజికవర్గానికి చెందిన ఎస్పీఎస్ జయప్రకాష్ నాయుడు కూడా చుడా కోసం ప్రయత్నించడంతో చిత్తూరుకు చెందిన పార్టీ సీనియర్ నేత దొరబాబు నాయుడు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. కమ్మ సామాజికవర్గానికి చెందిన ఇద్దరు నేతలకు ఈ పోస్టు ఇవ్వడం కన్నా, బలిజ సామాజికవర్గానికి చెందిన హేమలతకు ఇవ్వడం ఉత్తమమని పార్టీ హైకమాండ్‌కు చెప్పడంతో వసంత్‌కుమార్ నాయుడకు చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పోస్టును తనకు రిజర్వు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. చుడా పోస్టును తిరుపతి ఎమ్మెల్యే అన్న కొడుకు ఆరణి శ్రీనివాసులు ఆశించినా, అది అడియాశలుగానే మిగిలిపోయింది. తాజా ప్రకటనతో టీడీపీ గ్రూపు రాజకీయాలు తప్పవనే సంకేతాలు విశ్లేషకుల నుంచి వెలువడుతున్నాయి.

పిచ్చిరాతలు.. అసభ్యకర పోస్టులు!

- అలాంటి వాటిని పోస్టు చేసిన వారిని శిక్షించండి
- తిరుపతి లా అండ్ ఆర్డర్ ఏఎస్పీకి ఫిర్యాదు
- పాల్గొన్న టీటీడీ మాజీ చైర్మన్, ఉమ్మడి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి క్రైమ్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, వెంటనే వారిని శిక్షించాలని టీటీడీ మాజీ చైర్మన్, ఉమ్మడి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తిరుపతి లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలు నెరవేర్చకుండా వాటిపై ప్రశ్నిస్తున్న ప్రజలను జైల్లో పెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికపరంగా పెరిగిన ప్రచార మాధ్యమాల్లో ఎంతోమంది తమకు తోచిన విధంగా ప్రభుత్వంపై వ్యతిరేక పోస్టులు పెట్టడం సహజమన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపే వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణా రహితంగా చితకబాదడం బాధాకరమన్నారు. ఏడేళ్ల లోపు శిక్షపడే నేరాలకు స్టేషన్ బెయిల్ ఇవ్వాలనే సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదన్నారు. తమను ఎవరూ అడ్డుకోలేరని పోలీసులే విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సైకోలు అంటూ ముద్రవేసి కేసులు పెడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల కంటే జనసేన, టీడీపీ నాయకులు నీచాతినీచమైన పోస్టులు పెడుతున్నారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులపై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పోలీసులు కూడా వాటిని చూస్తూ ఊరుకుంటున్నారు తప్ప.. వారిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. టీడీపీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదనే బాధ, ఆగ్రహంతో కొందరు సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతున్నారని చెప్పారు. అలాంటి వారిపై దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ హాస్పిటల్‌లో ఉన్న ప్రవీణ్ అనే యువకుడి ల్యాప్‌ట్యాప్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అతన్ని అక్కడే వదిలేసి వచ్చారని చెప్పారు. దీనిపై పోలీసులు దొంగతనం చేశారని వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేయబోతోందని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి దిగజారుడు పనులు చేయడం ఏంటని ఆయన నిలదీశారు. చంద్రబాబు చేతుల్లో పోలీస్ వ్యవస్థ కీలు బొమ్మలా మారిందని ధ్వజమెత్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే భయపడే ప్రస్తే లేదని తేల్చిచెప్పారు. ఎంత తొక్కాలని ప్రయత్నిస్తే అంత గట్టిగా ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారు కాబట్టే వారిపై ఉన్న అసహనాన్ని వ్యంగ్యంగా చిత్రీకరించి ప్రజలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. అది తట్టుకోలేకే ఇలాంటి దుశ్చర్యలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఏఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట తిరుపతి మేయర్ శిరీష, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గాల సమన్వయకర్తలు చెవిరెడ్డి మోహిత్, రాజేష్, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ లీగల్ సెల్ కార్యదర్శులు, సోషల్ మీడియా వింగ్ ప్రతినిధులు ఉన్నారు.



తిరుపతి జిల్లా లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారికి ఫిర్యాదు అందజేస్తున్న టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

స్నపన తిరుమంజనంలో సేదతీరిన శ్రీవారు



స్నపన తిరుమంజనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీ, భూ, పురుష, నీల, నారాయణ సూక్తాలను మంత్రోచ్చారణలతో, ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనంతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తిరుమల జీయర్ స్వామీజీల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవిందరాజ దీక్షితులు పవిత్రోత్సవాలు నిర్వహించారు. అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వైభవంగా పుష్పాల ఊరేగింపు



పుష్పాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. తిరుమలలోని కల్యాణవేదిక వద్ద గల ఉద్యానవన విభాగంలో పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకొచ్చారు.

స్వేచ్ఛను కాలరాస్తారా?

- ప్రజా సమస్యలపై గళమెత్తితే కేసులు.. అక్రమ అరెస్టులా?
- భావప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు
- ఆధునిక సమాజంలో సోషల్ మీడియాది ప్రధాన పాత్ర
- కక్షసాధింపు చర్యలపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదేం?
- కూటమి ప్రభుత్వ తీరు మారాలంటున్న వామపక్షాలు, శ్రామిక, విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ గళాన్ని స్వేచ్ఛగా వినిపించొచ్చు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగేలా ఎవరు వ్యవహరించినా శిక్షార్హులే. కానీ కూటమి ప్రభుత్వం దాన్ని విస్మరిస్తోంది. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. దీనిపై కొందరు అసహనంతో సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. అలాంటి వారిని కూటమి నేతలు టార్గెట్ చేస్తున్నారు. అధికార అండతో వారిని వేధించడం.. అరెస్టులు చేయడం.. పోలీసుల చేత చితకబాదించడం లాంటివి చేస్తున్నారు. దీనిపై వామపక్ష, శ్రామిక, విద్యార్థి సంఘాల నాయకులు విరుచుకుపడుతున్నారు. చట్టవిరుద్ధ కార్యక్రమాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం



కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసింది. అనవసరమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటు. వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు చేస్తే మాత్రం చర్యలు తీసుకోవాల్సిందే. కానీ సమస్యలపై ప్రస్తావించినా భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇదో మెసేజ్‌గా ప్రభుత్వం భావించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

–వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి

ప్రతిపక్షాల నోరు నొక్కే ప్రయత్నమే



గతంలో ఎప్పుడో సోషల్ మీడియాలో పెట్టిన క్లిప్పింగ్‌లను నేడు వెలికితీసి అరెస్టులు చేస్తామంటూ భయానక వాతావరణాన్ని సృష్టించడం దారుణం. ప్రభుత్వానికి అనుకూలంగా మెసేజ్‌లు, వీడియోలు పెడితే కేసులు ఉండవు. ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిన విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలయజేస్తే తప్పుపట్టి కేసులు పెట్టడం బాధాకరం. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని మేల్కొల్పే హక్కు ఉంది. అందులో భాగంగానే సోషల్ మీడియాను ప్రజలు వినియోగిస్తున్నారు.

–పీ.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి



హక్కులను తొక్కిపెట్టడం దారుణం



రాజ్యాంగం కల్పించిన హక్కును రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెట్టడం దారుణం. ప్రజావసరాలతో పాటు, సమస్యలు ప్రభుత్వానికి ఏకరువు పెట్టడానికి సోషల్ మీడియాను ప్రతి వ్యక్తీ వినియోగిస్తున్నారు. ఇందులో ఏదో తప్పు జరిగినట్లు తమ ప్రభుత్వానికి భంగం కలిగినట్లు వ్యహరించి కేసులు పెట్టి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణం. ప్రతి వ్యక్తి దీన్ని ఖండించాల్సిన అవసరం ఉంది.

–శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి

ప్రజాగ్రహం తప్పదు



సోషల్ మీడియా నోరు నొక్కి ప్రభుత్వం తనమీద తానే మట్టి వేసుకుంటోంది. ఇలా వ్యహరిస్తే ప్రజాగ్రహం తప్పదు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యహరించలేదు. సమస్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే అరెస్టులు చేస్తారా..? కూటమి వ్యవహార శైలి దారుణంగా ఉంది. నిరంకుశ పాలనను తలపిస్తోంది. ప్రతిపక్షాల నోరు నొక్కి తాము చెప్పిందే శాసనం అంటూ హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమే.

–జీ.మల్లికార్జున, ఎన్ఎస్‌యూఐ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

అక్రమ అరెస్టులు అన్యాయం



సోషల్ మీడియా ఆధునిక సమాజానికి అవసరం. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని ప్రజలు సమాజానికి తెలియజేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు, మెసేజ్‌లు, పోస్టులు పెడితే అది క్షమించరాని నేరంగా భావించి పోలీసులను పురుగొల్పి అరెస్టులు చేయడం సమంజసం కాదు. వ్యక్తిగత పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లితే చర్యలు తీసుకోవాలి తప్ప, ప్రజా సమస్యలపై గళం విప్పిన వారిపై కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదు.

–జయచంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, తిరుపతి

క్లుప్తంగా

ఫారెస్టు అధికారుల సంఘం అధ్యక్షుడిగా చిన్నబాబు



చంద్రగిరి: చిత్తూరు, నెల్లూరు జిల్లాల జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పనపాకం రేంజ్ అటవీ అధికారి(డీఆర్‌ఓ) చిన్నబాబు శనివారం ఎన్నికయ్యారు. ఈ మేరకు తిరుపతిలో అసోసియేషన్ ఎన్నికలను రాష్ట్ర సంఘ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల ఫలితాల్లో చిన్నబాబు అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యవర్గ సభ్యులుగా శంకరప్ప, లక్ష్మీప్రసాద్, ప్రసాద్, మధు, రెహానాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు అటవీ అధికారులు చిన్నబాబుకు అభినందనలు తెలిపి, ఘనంగా సత్కరించారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న వైభవం



ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రవణోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తిచేశారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. సాయ ంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారి నాగరాజు, అర్చితం అధికారి భరత్, భ ద్రతా జమేదార్ మల్లికార్జున పర్యవేక్షించారు.

మద్యం షాపును వెంటనే తొలగించాలి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ, రాజీవ్‌గాంధీ కాలనీలో పెట్టిన మద్యం షాపును వెంటనే తొలగించాలని ఐద్వా నాయకురాలు సత్యశ్రీ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మహిళలు, ఐద్వా నాయకురాళ్లు ఎక్సైజ్ సీఐ నరసానాయుడుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ వైన్ షాప్ ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, పిల్లలకు రక్షణ ఉండదన్నారు. స్పందించిన సీఐ మద్యం షాపును తొలగించి వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మీ, సీపీఎం నాయకుడు సెల్వరాజ్, సుబ్బలక్ష్మి, సుశీలమ్మ, దేసమ్మ, సరిత, మని, తులసి, బాలయ్య, సుబ్బమ్మ పాల్గొన్నారు.

దొంగనోట్లు మారుస్తూ పట్టుబడిన తండ్రీ కూతురు

– విచారిస్తున్న పోలీసులు

పుత్తూరు: పట్టణంలో శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో రూ.500 దొంగ నోట్లను మారుస్తున్న తండ్రీ కూతురు పట్టుబడ్డారు. పుత్తూరులోని తిరుపతి రోడ్డు, మండీ స్ట్రీట్‌లోని ప్రొవిజన్ షాపుల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ రూ.500 నోట్ ఇచ్చి చిల్లర తీసుకున్నారు. తర్వాత మళ్లీ ప్రతి షాపు వద్ద రెండేసి రూ.500 నోట్లు ఇచ్చి చిల్లర కావాలంటూ అడుగుతుండడంతో షాపు యజమానులకు అనుమానం కలిగింది. వెంటనే వారిచ్చిన నోట్లను మిషన్ ద్వారా చెక్ చేయడంతో అవి దొంగనోట్లు అని తేలింది. వెంటనే షాపు యజమానులు వారిని పూల మార్కెట్ వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా వీరు తిరుచానూరుకు చెందిన వారుగా తెలిసింది.

తుమ్మలగుంటలో సప్తవర్ణశోభితం

- వైభవంగా కల్యాణ వెంకన్న పుష్పయాగం
- 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో నివేదన



కల్యాణ వెంకన్నకు పుష్పార్చన

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6.30 గంటల వరకు ఆలయంలో ప్రత్యేకంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పయాగానికి ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఆ తర్వాత సాయంత్రం 3 గంటల నుంచి పుష్పయాగాన్ని కనుల పండువుగా నిర్వహించారు. 12 రకాల పుష్పాలు, 6 రకాల పరిమళ భరిత పత్రాలు (ఆకులు)తో స్వామి వారికి నివేదన చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించే పుష్పయాగం తరహాలనే వైఖానస ఆగమోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను పుష్పయాగంలో ఉపయోగించారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే పుష్పయాగానికి సుమారు 3 టన్నుల పుష్పాలను వినియోగించారు.

భక్తులకు ప్రసాదంగా అందజేత

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు పుష్పయాగంలో నివేదించిన పుష్పాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అరుదైన పుష్పాలు చేతికి రావడంతో భక్తులు ఆనందంగా స్వీకరించి భక్తితో తమ వెంట తీసుకుని వెళ్లారు. పుష్పయాగ మహోత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తుల భారీ ఏర్పాట్లు చేపట్టారు.



భక్తులతో కలిసి పుష్పాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న చెవిరెడ్డి దంపతులు



స్వామివారి నివేదనకు తీసుకొచ్చిన వివిధ రకాల పుష్పాలు

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో ఉన్న వైద్యశాఖ అధికారులను సమన్వయం చేసుకొని క్యాన్సర్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని డీఎంహెచ్‌వో డాక్టర్ యు.శ్రీహరి పిలుపు నిచ్చారు. కన్సార్టియమ్ ఆఫ్ హెల్త్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ, టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం యూత్ హాస్టల్లో మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నిర్మూలన కోసం శిక్షకులకు శిక్షణ అనే ట్రైనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ అనేది మహిళలు అక్కడ ప్రారంభ దశలో ఉన్నప్పుడే అవగాహన కల్పించి హాస్పిటల్‌కి వెళ్లి స్క్రీనింగ్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం డాక్టర్ల సలహాల మేరకు క్రమం తప్పకుండా చికిత్సలు చేసుకుంటూ మందులు వాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం హాజరైన శిక్షకులకు డీఎంహెచ్‌ఓ సర్టిఫికెట్లు అందజేశారు. పరివర్తన సేవా సంస్థ డైరెక్టర్ అమరనాథ్, చాయ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సహాయ కార్యదర్శి ధరణి నరసింహ, హెల్పింగ్ అండ్ సొసైటీ కార్యదర్శి ఎన్.దొరస్వామి, ఆర్ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ జీవీఎస్.బాబు, క్రాస్ ఎన్‌జీవో భూపతి, గ్రేడ్ ఎన్‌జీవో శేషాద్రి, తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, అన్నమ య్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న రమేష్ నెల క్రితం కిందపడి గాయపడ్డాడు. ఆ తర్వాత పై అధికారులకు ఫోన్ చేసిన మూడు రోజులు సెలవు కావాలని చెప్పాడు. అయితే తాను ఎవరికీ చెప్పకుండా విధులకు హాజరు కాలేదనే నెపంతో అధికారులు అతన్ని సస్పెండ్ చేశారు. మళ్లీ చేర్చుకోవాలని కోరగా ఎవరూ పట్టించుకోకపోవడంతో సోషల్ మీడియా వేదికగా సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇందులో పై ఉద్యోగులు ఇద్దరు రూ.50 వేలు ఇస్తే చేర్చుకుంటామని చెప్పడం తనను బాధించిందన్నారు.



సెల్ఫీ వీడియోలో రమేష్‌రాజు

వర్సిటీల్లో ఉత్తమ అధ్యాపకులు వీరే








ప్రొఫెసర్లు ఎం.రాజశేఖర్ , కేవీ.సుచరిత, టీ.సీతాకుమారి, ఏ.శ్రీదేవి, ఆర్.ఉషా, డాక్టర్ జీ.మోహన్‌నాయుడు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉత్తమ అధ్యాపక అవార్డుల జాబితాను ప్రకటించింది. ఇందులో ఎస్వీయూ నుంచి జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, న్యూట్రీషియన్ విభాగపు ప్రొఫెసర్ కేవీ సుచరిత ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. అలాగే పద్మావతి మహిళా వర్సిటీ నుంచి లా డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ టీ.సీతాకుమారి, ఫిజిక్స్ అండ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ కో–ర్డినేటర్, ఇన్‌చార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఏ.శ్రీదేవి, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.ఉషాకు ఉత్తమ అధ్యాపక అవార్డు వరించింది. అగ్రికల్చరల్ కళాశాలలో స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ జీ.మోహన్‌నాయుడు ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకోనున్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్ వేదికగా సోమవారం అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

రోడ్డు ప్రమాదంలో నేపాల్ వాసి మృతి



తడ: జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నేపాల్‌కి చెందిన దమ్మరే పరియర్(53) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు.. పూడి గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ హోటల్‌లో పరియర్ పనిచేస్తున్నారు. ఎప్పటిలాగా పనిముగించుకుని రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో రహదారిపై వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పరియర్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లారు. కానీ అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

తిరుపతి క్రైమ్: అక్రమాస్తులు కలిగిన కేసులో మదనపల్లి మాజీ ఆర్డీవో మురళి ఇళ్లపై ఏకకాలంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. శనివారం ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో ఐదు జిల్లాల్లోని 13 ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. కడప, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో సోదాలు చేపట్టారు. తిరుచానూరు సాయి గ్రాండ్ హోటల్‌తో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. మదనపల్లిలో పనిచేసే సమయంలో ఇతను ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు సంపాదించినట్లుగా గుర్తించమన్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం కేసు వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. ఇప్పటికే ఇత ని వద్ద పెద్ద ఎత్తున ఆస్తులు గుర్తించినట్లు సమాచారం.

గ్రావెల్ టిప్పర్లకు రూ.5.2 లక్షల జరిమానా

సత్యవేడు: గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు టిప్పర్లకు రూ.5.2 లక్షల జరిమానా విధించినట్టు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈనెల 4వ తేదీన ఊత్తుకోట– సత్యవేడు మార్గంలో తనిఖీలు నిర్వహించగా గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లు పట్టుబడ్డాయన్నారు. వాటికి రికార్డులు సరిగా లేకపోవడంతో సీజ్ చేసి, జరిమానా విధించినట్టు తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు

వెంకటగిరి(సైదాపురం): గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చిత్తూరు ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, 31 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన శనివారం మండలంలో చర్చనీయాంశమైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ కథనం.. చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి ఆదేశాల మేరకు వెంకటగిరి ఎన్‌ఫోర్స్ పరిధిలోని వెంకటగిరి రూరల్ మండలం వర్ధనపల్లి గ్రామంలో తమ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన జే.శంకరయ్య 30 మద్యంబాటిళ్లు కలిగి ఉన్నట్లు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు శంకరయ్యను అరెస్ట్ చేసి వెంకటగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పచెప్పినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రాజేంద్ర, సురేంద్రబాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

సైదాపురంలో ముమ్మర దాడులు

– ఒకరి అరెస్ట్

సైదాపురం : మండలంలో జోరుగా బెల్టు షాపులు ఉండడంతో నిత్యం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సైదాపురం ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో తోచాం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసును నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అలాగే మండలంలో 31 గ్రామ పంచాయతీలుండగా వాటిలో ఒక్క గోకుల బృందావనం మినహా మిగిలిన గ్రామ పంచాయతీల్లో 3 నుంచి 5 బెల్టు షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ఆయా బెల్టు షాపుల జోలికి వెళ్లకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



వెంకటగిరి : మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నిర్మాణాత్మక పద్ధతులతో సమ సమాజ స్థాపన



వర్క్‌షాపులో రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు, ఐఏఎస్ అధికారులు

– తిరుపతి ఐఐటీలో పబ్లిక్ పాలసీలపై వర్క్‌షాప్

ఏర్పేడు(రేణిగుంట): సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొని సమ సమాజ స్థాపనకు నిర్మాణాత్మక విధానాలను అవలంభిండం ద్వారానే సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన సీఆర్ఐఎస్‌పీ సహకారంలో ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శనివారం పబ్లిక్ పాలసీలపై వర్క్‌షాపు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాపును ఐఐటీ ఐఐటీ హ్యూమన్ రిసోర్స్ అండ్ సోషల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు హాజరయ్యారు. 15 సెషన్లలో జరిగిన ఈ వర్క్‌షాపునకు పలువురు సెక్రటరీ ర్యాంకు స్థాయి కలిగిన ఐఏఎస్‌లు పాల్గొని పబ్లిక్ పాలసీలపై సాధ్యాసాధ్యాలను చర్చించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉత్పాదక రంగాలలో సమకాలీన విధానపరమైన సమస్యలపై విశదీకరించారు. వికేంద్రీకరణ, పేదరికం, అసమానత, పారదర్శకత, జవాబుదారీతనం వంటి సామాజిక సవాళ్లనులోతుగా చర్చించి సమసమాజ స్థాపనకు చేపట్టాల్సిన చర్యలను చర్చాగోష్టిగా వివరించారు. సీఆర్ఐఎస్‌పీ సీఈఓ ఆర్.సుబ్రమణ్యం దేశంలోని ఎన్ఈపీ విధానాలను గురించి ప్రస్తావించారు. ఆర్ఎస్ జులానియా మేఘాలయా రాష్ట్రంలో పాఠశాల విద్యావిధానాన్ని మెరుగుపరచడంలో ఉన్న సవాళ్లపై చర్చించారు. టీ.విజయకుమార్ అనంతపురం జిల్లాలో రైతుల ఆదాయాన్ని పెంచిన సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను గురించి పేర్కొన్నారు. పేదరికం, జనాభా, పాలన, అభివృద్ధి, వికేంద్రీకరణ వంటి అంశాల గురించి మొత్తం దేశంలో వివిధ విభాగాలకు చెందిన 15 మంది ఐఏఎస్ అధికారులు సామాజిక సవాళ్ల గురించి ఈ సమావేశంలో చర్చించారు.

ఇసుక సమస్యతోనే ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

తిరుపతి అర్బన్: ఇసుక సమస్య వల్లే పక్కాగృహాల నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. ఇసుక రవాణా చార్జీలు హౌసింగ్ అధికారులే పెట్టుకోవాలని సూచించారు. త్వరలో ఉపాధి పథకంతోపాటు జేజేఎం, అమృత పథకాల ని , ధులతో హౌసింగ్ కాలనీలు అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పంలోని హౌసింగ్ కాలనీల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.

నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేశారు

హౌసింగ్ కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేశారని మంత్రి ఆరోపించారు. వాటిపై విచారణ చేపట్టాలని జేసీని ఆదేశించారు. అంతేకాకుండా కొందరు బినామీ పేర్లతో ఇంటిపట్టాలు పొందారని, మరికొందరు ఇంటి పట్టాలు తీసుకుని విక్రయించారని వాటిపై కూడా విచారణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కురుగొండ రామకృష్ణ, పులివర్తి నాని, విజయశ్రీ, మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిధుల కొరత లేదు

హౌసింగ్ మంత్రి మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపుల్లో నిధుల కొరత లేదని చెప్పారు. అయితే అధికారులు బిల్లులు ఇవ్వడంతో జాప్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని హౌసింగ్ కాలనీల్లో లక్ష ఇండ్లు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నుంచి రెండో దశగా కేంద్ర ప్రభుత్వం నిధులతో హౌసింగ్ స్కీమ్ మొదలు పెడుతామని తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ అధికారులు జీవీ ప్రసాద్, నాగభూషణం పాల్గొన్నారు.